నవతెలంగాణ
మనుసు తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | జనవరి 13, 2024 | www.navatelangana.com

సేవాదృక్పథాన్ని కలిగి ఉండాలి

నవతెలంగాణ-కెరమెరి

సేవాదృక్పథాన్ని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఎఫ్ఆర్ఓ మజారుద్దీన్ అన్నారు. పంచముఖి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చింతకర్ర గ్రామానికి చెందిన గిరిజనులకు ఎఫ్ఆర్ఓ చొరవతో దుప్పట్లను పంపిణీ చేశారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని మందమర్రికి చెందిన స్వచ్ఛంద సంస్థ సహకారంతో సుమారు 100 దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి, వన్యప్రాణుల రక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రకృతిని మనం కాపాడినప్పుడే ప్రకృతి మనల్ని కాపాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఉల్లాస్, సంస్థ అధ్యక్షుడు కృష్ణ చైతన్య, సభ్యులు నరసింహ శాస్త్రి, అజయ్ పాల్గొన్నారు.



కళాశాల ప్రిన్సిపాల్ తీరుపై లెక్చరర్ల నిరసన

నవతెలంగాణ-భైంసా

ప్రభుత్వజూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, లెక్చరర్ల మధ్య వార్ కొనసాగుతోంది. ప్రిన్సిపాల్ జుఫిషా సుల్తానా తమను ఆకారణంగా అసభ్య పదజాలంతో మాట్లాడుతూ, అవమానపరుస్తోందని, మానసిక వేధింపులకు గురి చేస్తోందని ఆరోపిస్తూ లెక్చరర్లు శుక్రవారం ముకుమ్మడిగా విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. కళాశాల వార్షికోత్సవ క్రీడ పోటీలను, విధులను సైతం లెక్చరర్లు బహిష్కరించారు. ప్రిన్సిపాల్ వేధింపుల నుంచి విముక్తి కల్పించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. పలువురు లెక్చరర్స్ మాట్లాడుతూ కొంత మంది విద్యార్థులను ఉసిగొల్పుతూ ఇబ్బందుల పాల్జేస్తోందని, ఉర్దూ, తెలుగు, మరాఠీ మీడియానికి చెందిన లెక్చరర్లు, ఒకేషనల్ లెక్చరర్లలను విడదీసి అంతరాలు పెంచేలా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా కళాశాలను సందర్శించి తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రిన్సిపాల్ జూపిషా సుల్తానాను వివరణ కోరగా విధుల పట్ల తాను కచ్చితత్వంగా వ్యవహరిస్తుండటంతో గిట్టని లెక్చరర్లు ఇలా వ్యవహరిస్తున్నారని అన్నారు.

గుండె గు'బిల్'..!

- చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌ల గోస
- రూ.లక్షల్లో పేరుకుపోయిన పెండింగ్ బకాయిలు
- మరో 18రోజుల్లో పూర్తికానున్న పదవీ కాలం
- బిల్లులపై ఆందోళనలో గ్రామ ప్రథమ పౌరులు

గ్రామ ప్రథమ పౌరులమనే సంతోషమే తప్ప.. చేపట్టిన పనులకు బిల్లులు రాక తిప్పలు పడుతున్నారు. గ్రామానికి సర్పంచ్ కావాలని ఆశపడిన వారికి ఎన్నికల్లో గెలిచాక అనేక అవస్థలు ఎదురయ్యాయి. వివిధ పథకాల కింద చేపట్టిన పనులు బిల్లులు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరుచేయకపోవడంతో అప్పులు పాలు కావాల్సి వచ్చింది. సర్పంచ్ అయిన తర్వాత అభివృద్ధి పనులు చేయకపోతే విమర్శలు వస్తాయని భావించి అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తిచేస్తే..వాటి విడుదల కోసం తిప్పలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు రాకపోవడంతో అసంతృప్తితో ఉన్న పలువురు సర్పంచ్‌లు పదవికి రాజీనామా చేయాలని భావించగా.. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో కొనసాగారు. పదవిలో ఉన్నన్ని రోజులు బిల్లుల కోసం వెంపర్లాడిన సర్పంచ్‌లు మరో 18 రోజుల్లో పదవి నుంచి దిగిపోనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం.. పదవీకాలం కూడా ముగిసిపోనుండటంతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు వస్తాయా రావా అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈమె పేరు విజయలక్ష్మీ. కెరమెరి మండలం ఖైరి గ్రామ సర్పంచ్. గ్రామంలో ఉపాధిహామీ నిధులతో రైతువేదిక, క్రీడా ప్రాంగణం, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. తొలుత ప్రభుతం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఇతరుల వద్ద నుంచి అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు పూర్తిచేశారు. సుమారు రూ.14లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఎనిమిది నెలల నుంచి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. కానీ విడుదల కావడం లేదు. మరో పక్షం రోజుల్లో పదవీ కాలం ముగియనున్న దృష్ట్యా పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏమిటనే ఆందోళన నెలకొంది. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేక మంది సర్పంచులు బిల్లుల కోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామానికి సర్పంచ్ కావాలని అనేక మంది ఆశపడుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది యువత ఈ పదవిపై ఆసక్తి చూపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో తమ గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తపనపడుతుంటారు. కానీ ఈ మధ్య కాలంలో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా ఎన్నికైన వారు ఈ ఐదేండ్ల కాలంలో బిల్లుల కోసం తీవ్ర తిప్పలు పడాల్సి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లెలకు విడుదల చేయాల్సిన 15వ ఆర్థికసంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ, ఉపాధిహామీ, జనరల్‌ఫండ్ తదితర వాటిని తీవ్ర జాప్యం చేయడంతో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆపసోపాలు పడ్డారు. పలుమార్లు ఆందోళనలు చేపట్టడంతో కొద్దికొద్దిగా నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం వారిని శాంతింపజేసింది. కానీ ఇంకా రూ.లక్షల సంఖ్యలో బిల్లులు పేరుకుపోవడంతో ఎప్పటిలోగా విడుదలవుతాయో తెలియక అయోమయంలో ఉన్నారు. మరో 18రోజులు గడిస్తే సర్పంచ్ పదవీకాలం ముగియనుంది. పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడలో అధికారుల పాలన అనివార్యమవుతోంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలో అధికారుల పాలన ప్రారంభం కానుంది.

పల్లెల్లో అనేక పనులు..!

ఉమ్మడి జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలు ఉండగా ఆదిలాబాద్ జిల్లాలో 468, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335, నిర్మల్‌లో 396, మంచిర్యాల జిల్లాలో 310 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో వివిధ కారణాలతో కొన్ని పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. వీటిని మినహాయిస్తే అన్ని పంచాయతీలకు సర్పంచ్‌లు ఉన్నారు. గత ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. పల్లె ప్రగతి పేరిట వైకుంఠధామాలు, రైతువేదికలు, డంపింగ్‌యార్డులు, ఇంటింటి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ల కొనుగోలు, పారిశుద్ధ్య కార్మికుల నియామకం, హరితహారం మొక్కల పెంపకం తదితర వాటిని చేపట్టింది. సీసీ రోడ్లు, లైటింగ్ తదితర వాటిని మినహాయించి అధిక భాగం పనులను ఉపాధిహామీ నిధులతోనే చేపట్టింది. కొన్ని పనులకు టెండర్లను పిలిచి గుత్తేదారులకు అప్పగించగా.. మరికొన్నింటిని సర్పంచులే స్వయంగా పనులు చేపట్టారు.అప్పట్లో ప్రభుత్వం, అధికారుల ఒత్తిడి మేరకు పనులు త్వరగా చేపట్టేందుకు చాలా మంది సర్పంచ్‌లు సొంత డబ్బులు వెచ్చించి ఆయా అభివృద్ధి పనులను పూర్తిచేశారు. మధ్యలో కొన్ని సందర్భాల్లో బిల్లుల కోసం ఆందోళనలు చేసిన సమయంలో కొంత నిధులను విడుదల చేసిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించలేదు. ఇప్పటికీ ఆయా పనులకు సంబంధించి ఒక్కో సర్పంచ్‌కు రూ.5లక్షల నుంచి రూ.15లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో పదవీకాలం ముగిసిపోవడంతో పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏంటనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. తాజాగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా పెండింగ్ బిల్లులను సకాలంలో విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని అడవి పంది మృతి చెందగా సమీపానే ఉన్న అటవీ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. సాధారణంగా వన్యప్రాణి మృతి చెందిన విషయం తెలుసుకొని అటవీ శాఖ అధికారులు చాలా హడావుడి చేస్తుంటారు. కానీ గూడెం అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని అడవి పంది మృతి చెందింది. కానీ వారు చూసీచుడనట్లు వ్యవహరించారు. ఫలితంగా రోడ్డుపై మృతి చెందిన అడవి పంది అటుగా వచ్చే వాహనాల కింద పడి చల్లాచెదురు అయిపోయింది. రైతుల వ్యవసాయ బావుల వద్ద ప్రమాదవశాత్తు చనిపోయిన వన్యప్రాణుల విషయంలో హడావుడి చేసే అటవీ శాఖ అధికారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అడవి పంది విషయంలో పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మృతి చెందిన అడవి పందిని అక్కడి నుండి తొలగించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర స్థాయి అండర్- 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్ పోటీలకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో జరిగిన సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలలో వడై గోపాల్, తైదల రణధీర్ సేన, జాడే సాయికుమార్, రామిల్ల అజయ్, దుర్గం నవీన్, మొల్కర్ వర్ధన్, కొత్తపల్లి ఉదయ్ మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున ఎంపికయ్యారని అన్నారు. ఈ నెల 12 నుండి 14 తేదీ వరకు సిద్దిపేట జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేసు ఉపేందర్, పీడీ సట్ల శంకర్, పిఈటీ కోట యాదగిరి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బి బాబురావు, హౌస్ మాస్టర్ కోసరి మహేష్ చంద్ర, నరసింహచారి, సతీష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

- తక్షణ సాయం కింద రూ.20వేలు అందజేత

నవతెలంగాణ - చింతలమానేపల్లి

కాగజ్‌నగర్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు అల్లూరి పోచం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ బాబాసాగర్ గ్రామంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ సురేష్ కుమార్ హోంగార్డు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఎస్పీ ఆదేశానుసారం కాగజ్‌నగర్ డిఎస్‌పి కరుణాకర్, టౌన్ సిఐ బుద్దే స్వామి, హోంగార్డు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ పోచం కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందించారు. కౌటల సిఐ సాదిక్ పాషా తన వ్యక్తిగతంగా రూ.10వేలు అందించారు. కుటుంబ సభ్యులకి ఎటువంటి సహాయం కావాలన్నా జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.

కేతేశ్వర కంకాలమ్మ జాతర పోస్టర్లు ఆవిష్కరణ



జన్నారం : మండల కేంద్రంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని విర్లగుట్టపై వెలిసిన శ్రీ కేతేశ్వర స్వామి కంకాలమ్మ జాతర పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉట్నూర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, వేర్వేరుగా కేతేశ్వర స్వామి కంకాలమ్మ జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. జాతర మహోత్సవానికి రావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. జాతర జనవరి 28న ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, శంకర్, అంజన్న, అశోక్, రాజన్న పాల్గొన్నారు.

7సార్లు రక్తదానం చేసిన యువకునికి సన్మానం

జన్నారం : మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన స్నేహ యూత్ సభ్యుడు బచ్చల శివకుమార్ ఏడుసార్లు రక్తదానం చేయడంతో అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా యువజన సంఘాల అధికారి శ్రీకాంత్‌రెడ్డి శాలువా పూలమాలతో సత్కరించారు. శుక్రవారం స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా రక్తదానం చేశాడు. అలాగే స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేయడంతో సన్మానం పొందాడు. కార్యక్రమంలో స్నేహ యూత్ సభ్యులు రమేష్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



లారీ డ్రైవర్ల ఆందోళనతో పత్తి కొనుగోళ్లకు బ్రేక్

- దారి పొడవునా నిలిచిన వాహనాలు
- యార్డును సందర్శించిన అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే
- చర్చల అనంతరం కొనుగోళ్లు ప్రారంభం

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

హిట్ అండ్ రన్ చట్టం కారణంగా లారీ డ్రైవర్ల ఆందోళనతో పట్టణంలో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి మార్కెట్‌లో పెద్ద ఎత్తున వాహనాలు వచ్చినా ట్రేడర్స్ కొనుగోళ్లు చేయలేదు. దీంతో ప్రక్రియ నిలిచిపోయింది. మూడు రోజులుగా లారీ డ్రైవర్ల సమ్మె కారణంగా జిన్నింగు మిల్లుల్లో స్టాక్ విపరీతంగా పెరిగిపోవడంతో కొనుగోళ్లు చేయలేదు. మధ్యాహ్నం వరకు కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి అక్కడి చేసుకొని లారీ ఓనర్స్, ట్రేడర్స్‌తో మాట్లాడారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ అక్కడి చేరుకొని ఇరువురి సమస్యలను తెలుసుకున్నారు. లారీ డ్రైవర్స్, ఓనర్స్, ట్రెడర్స్ మధ్య సమస్యల కారణంగా రైతులకు ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోబోమన్నారు. సమస్యలను తన దష్టికి తీసుకువస్తే కలెక్టర్, యంత్రాంగంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ట్రెడర్స్ కొనుగోళు చేసేందుకు ముందుకు వచ్చారు.



ఉద్దేశపూర్వకంగా మార్కెట్‌ను శాసిస్తే చర్యలు తీసుకుంటాం : ఎమ్మెల్యే శంకర్

ఉద్దేశపూర్వకంగా మార్కెట్ యార్డును శాసించేందుకు యత్నిస్తే ఎంతటి వారైన చర్యలకు వెనకడబోమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన పంటల విక్రయాల్లో ఎవరు ఇబ్బందులు కల్గించవద్దన్నారు. సొంతలాభం కోసం రైతులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోబోమన్నారు. ట్రేడర్స్, లారీ ఓనర్స్ సమస్యలను విన్నామని, వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు. హిట్ అండ్ రన్ చట్టం అమలుపై ఎలాంటి స్పష్టత లేదన్నారు. కానీ దీన్ని ఆసరాగా చేసుకోని మార్కెట్ ను శాసిస్తామంటే చట్టపరమైన చర్యలకు కలెక్టర్, ఎస్పీతో మాట్లాడుతానని అన్నారు. రైతులకు ఎలాంటి నష్టం వచ్చిన సహించేది లేదని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవి, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ హిట్ అండ రన్ చట్టం కారణంగా లారీ డ్రైవర్ల ఆందోళన కారణంగా పత్తిని ఎగుమతి చేయలేదన్నారు. దీంతో జిన్నింగుల్లో నిల్వలు పెరిగిన కారణంగా ట్రేడర్స్ కొనుగోళ్లు చేపట్టలేదన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా హామీ ఇవ్వడంతో మళ్లీ కొనుగోళ్లు ప్రారంభయ్యాయని తెలిపారు.



ఉత్తమ సేవా అవార్డు అందుకున్న సంతపురి రాజు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రజాసేవకుడిగా సాగుతున్న సంతపురి రాజు తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ప్రీమియం అవార్డు సెషన్‌కు ఎంపికయ్యాడు. అమ్మ ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్న రాజు గురువారం ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. సీనియర్ నటులు సత్యనారాయణ, సినీ నటులు, యూనివర్సిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి ఈ అవార్డును అందజేశారు. అవార్డు తీసుకోవడం వల్ల మరింత బాధ్యత పెరిగిందని రాజు తెలిపారు. సమాజ సేవ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



విషం పెట్టి పులిని చంపారు

- ముగ్గురు నిందితుల రిమాండ్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని దరిగాం అటవీ ప్రాంతంలో ఈ నెల 8న పులి మృతదేహం లభ్యం అయిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అటవీ శాఖ అధికారులు ముగ్గురు వ్యక్తులు కావాలని విషం పెట్టి చంపినట్టుగా తేలిందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వాంకిడి మండలం వెలిగి గ్రామపంచాయతీ రింగారెట్ గ్రామానికి చెందిన కోవ గంగు, ఆత్రం జలపతి, మరో మైనర్ బాలుడు తమ ఆవులను పులులు చంపుతున్నాయన్న నెపంతో పులులకు విషం పెట్టారని తెలిపారు. ఈ క్రమంలో పులి మృత్యువాత అనంతరం అన్ని కోణాల్లో విచారణ చేపట్టామన్నారు. సాక్షాధారాలతో నిందితులను అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టులో హాజరు పర్చగా కోర్టు 12 రోజుల జ్యుడీషియల్ రిమాండు విధించిందన్నారు.

నేటి యువతకు వివేకానందుడు ఆదర్శప్రాయుడు

- ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి యువతకు వివేకానందుడు ఆదర్శప్రాయుడని జడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డాడు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చిత్రపటాన్ని ప్రపంచ చిత్రపటంలో ప్రత్యేక దేశంగా గుర్తింపు తేవడంలో వివేకానందుడు పాత్ర మరువలేనిదన్నారు. 1863 జనవరి 12న జన్మించిన వివేకానందుడు కేవలం 39 సంవత్సరాలు మాత్రమే జీవించిన తనంటే ఏమిటో ప్రపంచానికి చాటారు కొనియాడారు. అతి చిన్న వయసులో అనేక సమావేశాలలో పాల్గొని భారత దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని తెలిపారు. ఆయన తెలిపిన కొటేషన్లు నేటి యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచులు బూసి భీమేశ్, పెద్దపల్లి శ్రీనివాస్, తిరుపతి, నాయకులు ప్రసాద్ గౌడ్, శంకర్, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు. సరస్వతి శిశు మందిర్ ఆవరణలోనూ స్వామివివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చైతన్య కళాశాలలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు రంగవల్లిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామి వివేకానంద 161జయంతిని సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి సామాజిక చైతన్య వేదిక నాయకులు, కాలేజీ ప్రిన్సిపాల్ లెక్చరర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూల స్తంభం లాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి స్వామి వివేకానంద ఎంతో కృషి చేశాడన్నారు. బలహీనులమని భావిస్తే బలహీనులే అవుతారు..బలీయమైన శక్తులమని భావిస్తే బలీయ శక్తులుగానే ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆంజనేయ ప్రసాద్, లెక్చరర్ రమేష్, ఎకనామిక్స్ లెక్చరర్ సత్తమ్మ, కాలేజీ లెక్చరర్లు సురేష్, చంద్రశేఖర్, చిరంజీవి, రాజేశ్వరి, సుధారాణి, భాగ్య, నాగరాణి పాల్గొన్నారు.

జన్నారం: స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను పొన్కల్ గ్రామపంచాయతీలో స్నేహ యూత్ అధ్యక్షులు దుమల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం చంద్రయ్య ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.



కాసిపేట లో..

కాలం చెల్లిన ఎస్ఎల్ యంత్రాలను తొలగించాలి

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట 1, 2 ఇంక్లైన్ గనులతో పాటు అన్ని సింగరేణి గనుల్లో కాలం చెల్లిన ఎస్ఎల్ యంత్రాలను తొలగించి, కొత్త ఎస్ఎ-ఎల్ యంత్రాలను తేవాలని, ఎస్డీఎల్ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మందమర్రి ఏరియా కాసిపేట 1వ గనిలో మేనేజర్ అల్లావుద్దీన్‌కు అందించారు. ఈ సంధర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడుతూ ఎస్ఈఎల్ యంత్రాలు తరుచూ రిపేర్లు కావడంతో ఉత్పత్తి రావడం లేదన్నారు. సింగరేణి సర్వీస్ అయిపోయిన యంత్రాలను నడపడం బాధాకరమని, నూతన యంత్రాలు తేకపోవడంతో భూగర్భ గనుల్లో నష్టాలు వస్తున్నాయన్నారు. వెంటనే నూతన యంత్రాలను తెచ్చి లక్ష్యాలను అధిగమించాలని, అదే విధంగా ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి రాజేందర్, సంపత్, ఆడెపు రవీందర్, రఘు, రాము, దామోదర్, అనిల్, కొండ కుమారస్వామి, సారయ్య, పరకాల తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతలు చేపట్టిన గంగాసింగ్‌కు ఎంపీపీ ఆడ చంద్రకళ రాజేశ్వర్ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. అంతకు ముందు ఉన్న ఎంపీడీఓను ప్రజాపాలన సమావేశానికి హాజరుకాకపోవడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సస్పెండ్ చేశారు. నార్నూర్ మండలంలో సూపరింటెండెంట్ విధులు నిర్వహిస్తున్న గంగాసింగ్‌కు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. సన్మాన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



సేవాదాస్ స్కూల్‌లో నవోదయ మాక్‌టెస్ట్

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని సేవాదాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐదో తరగతి విద్యార్థులకు నవోదయ అవగాహన మాక్‌టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు సేవాదాస్ స్కూల్‌తో పాటు ఎస్వీపీ ఉట్నూర్, మండలంలోని సతిశ్రీ, వివేకనంద స్కూల్ పాఠశాలల మొత్తం కలిపి 50 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు పాఠశాల కరెస్పాండెంట్ జాదవ్ ఉమాజీ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులు నవోదయ వార్షిక పోటీ పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి నవోదయ అవగాహన పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. ఇంతకు ముందు పాఠశాలలో చదివిన ఒక విద్యార్థి నవోదయలో సీటు దకించుకున్నట్టు కరెస్పాండెంట్ తెలిపారు. ఈ పరీక్షలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గిరిబాబు, రాజమౌళి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు


ఆదిలాబాద్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లా కేంద్రంలో స్వామి వివేకానంద 161జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో స్థానిక డైట్ మైదానం ఎదుట వివేకానంద చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశ ఖ్యాతిని, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ ఒక వ్యక్తి గొప్ప వ్యక్తిగా మారడానికి 100 సంవత్సరాలు జీవించాల్సిన అవసరం లేదని, ఎన్ని సంవత్సరాలు జీవించామని కాదని, ఎలా జీవించామనేదే ప్రాముఖ్యమని వివరించారు. యువత ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్య ఒక్కటే ప్రామాణికం కాదని అనుకున్న లక్ష్యాన్ని చేధించడానికి విద్య ఒక సాధన మాత్రమేనని అన్నారు. టాటా, బిర్లా, అంబానీ లాంటి కుబేరులు సైతం తక్కువగా చదువుకున్నప్పటికీ సంకల్ప బలంతోనే జీవితంలో రాణించగలిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షులు అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ ప్రవీణ్, యువజన సంఘాల సమితి నాయకులు బాలశంకర్ కృష్ణ, ఊరే గణేష్, బీసీ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు చిక్కాల దత్తు, కళాల శ్రీనివాస్, లాలా మున్నా, రాళ్ల బండి మహేందర్, కెమ శ్రీకాంత్, ఆకుల ప్రవీణ్, అజీజ్, అర్బాత్ ఖాన్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్ ఆధ్వర్యంలో..

స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయుడని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం వివేకానందుని 161వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డ్ వద్ద గల వివేకానంద స్వామి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ యువత వివేకానందుడి ఆశయాలను సిద్ధాంతాలను స్ఫూర్తిగా పొందుతూ మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పవన్‌నాయక్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, ఖలీం పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండలంలో వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని వర్ధమన్నూర్ గ్రామంలో ఏక్త అభియాన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు స్వామి వివేకానంద, భారతమాత, సరస్వతి మాత వేషధారణ వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బొంగురాల పుష్పలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను అలవర్చుకోవాలన్నారు. వివేకానంద సూక్తులు, బోధనలు అలవర్చుకొని అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈదుల మహేశ్వరి, మతాజీ శ్వేత పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : దేశ యువతకు స్ఫూర్తిదాయకం స్వామి వివేకానందుడనని బీజేపీ మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగం అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతిని జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుడు అతి చిన్న వయస్సులోనే భారత దేశ ఖ్యాతిని ప్రపంచమంతా చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. అటువంటి మహనీయుని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దీపకసింగ్ శేఖావత్, దిలీప్ మొరే, భీమ్‌రావ్, మరప్ప రాజు పాల్గొన్నారు.

ముత్నూర్‌లో..

మండలంలోని ముత్నూర్ గ్రామంలో యువ నేస్తం యూత్ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతిని ఘనంగా నిర్వహించారు. యూత్ అధ్యక్షులు నలగంటి రాజు, ఆదిమూలం నరేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు కిరణ్, దుర్వ సంజీవ్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తాడిహత్నూర్, ముక్తాపూర్ గ్రామంలో అధ్యాపకులు యువకులు శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి అలవాట్లను అలవర్చుకొని వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ విష్ణు, యూత్ సభ్యులు రవీందర్ ఫడ్, నాయకులు కేంద్రే సురేష్, కళాశాల ప్రిన్సిపల్ టి.మహేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, ఎల్లేశ్వర్ గంగాధర్, రవికిరణ్, పోశెట్టి, మధుకర్‌రెడ్డి, రత్నయ్య, అశ్వంత్, నరేందర్, మహేష్ పాల్గొన్నారు.

నిర్మల్ : డా.అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డా.కావేరి గ్రంథాలయంలో 162వ స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫౌండేషన్ సభ్యులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వామి వివేకాంద యువతకు ఆదర్శం అన్నారు. తన వ్యక్తిగతంగా కాకుండా దేశానికి ఎన్నో సేవలు చేయడం జరిగిందన్నారు. మనం కూడ ఉన్నత ఉద్యోగాలు సాధించి, వివేకానంద చూపిన బాటలో నడవాలని, ప్రజాసేవలకు అంకితం కావాలని అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దీపక్‌రెడ్డి, ఫౌండేషన్ కోఆర్డినేటర్ పోలీస్ బీమేష్, ఫౌండేషన్ సభ్యులు దీపక్, అభ్యర్థులు గోపి, స్రవంతి, నవీన్, రాజమణి గ్రంథాలయ పాఠకులు మహేష్, ప్రకాష్, మనీషా, శ్రీజ, స్రవంతి, గిరిపాల్, స్వామి, గోపి, ఆకాష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : స్వామి వివేకానందా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానందా అని కొనియాడారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, యువతరాన్ని ఉత్తేజపరిచి లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించవద్దని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీపీఆర్వో విష్ణువర్ధన్, కళాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, అధికారులు, యువత పాల్గొన్నారు.

కడెం : స్వామి వివేకానంద ను ఆదర్శంగా తీసుకోవాలి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా అన్నారు. శుక్రవారం మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో నవ యువశివ యూత్ అధ్యక్షులు కాసవేని తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు నవ యువ శివ యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు గైక్వాడ్ శశిపాల్ జ్ఞాపకార్థం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవ పురస్కరించుకొని రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్త హాజరై మాట్లాడారు యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని స్వామి వారి అడుగుజాడల్లో నడిచి విజయాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. అనంతరం యువకులతో కలిసి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీ. హరీష్, మోతుకురిసాయి గౌడ్, ప్రేమ్ కుమార్, మాణిక్ రావు, కొట్టే శేఖర్, ఎర్రన్న, నర్సింహశాస్త్రి, సాయి, గురు, వేణు, బెడిధ అంజి,డి.మహేష్, జీ. మహేష్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్‌లో..

బంజారా రచయితల వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని సేవాలాల్ మందిరంలో శుక్రవారం బంజారా రచయితల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బంజారా రచయితల వేదిక సభ్యులు, అతిథులు, సలహాదారులు, గౌరవ అధ్యక్షులు బంజారా పెద్దల చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఐటీడీఏ ఈఈ భీమ్‌రావ్ రాథోడ్ మాట్లాడుతూ బంజారా రచయితల వేదిక సభ్యులు తమ రచనల ద్వారా బంజారా సాహిత్యానికి ఊపిరి పోస్తున్నారని అన్నారు. ఎంతో మంది బంజారా మహనుభావుల జీవిత చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలను సభ్య సమాజానికి తెలియజేయడంలో వేదిక కవులు ముందు వరుసలో ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బంజారా రచయితల వేదిక గౌరవ అధ్యక్షులు బంకట్లాల్ జాదవ్, గౌరవ సలహాదారులు శ్రావణ్ రాథోడ్, వేదిక అధ్యక్షులు డాక్టర్ ఇందల్ సింగ్, బంజారా ప్రధాన కార్యదర్శి, దేవావత్ ధరమ్ సింగ్, ఉపాధ్యక్షులు మురళి జాదవ్, కార్యదర్శి చౌహాన్ పరమేశ్వర్, ప్రచార కార్యదర్శి చౌహాన్ గోవింద్, గణేష్ మహరాజ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో శ్రీ స్వామి వివేకానంద జయంతి ని పురస్కరించుకొని శుక్రవారం రక్తదాన శిబిరాన్ని యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు యూత్ కమిటీ సభ్యులు రాథోడ్ మహేందర్ నాయక్ తెలిపారు. ముఖ్యఅతిథిగా జెడ్పీచైర్మెన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అడ్వొకేట్ బానోత్ జగన్‌లు పాల్గొని రక్తాదాన శిబిరాన్ని ప్రారంబించారు. చైర్మెన్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఇతరుల ప్రాణాలు రక్షించ వచ్చని అత్యవసర సమయంలో ఉన్న వారికి మన వంతు రక్తం ఇచ్చి వారి ప్రాణాలను కాపాడుకుంటే మనం ఒక ప్రాణాన్ని కాపాడినవారమవుతామని సూచించారు. అనంతరం లింగోజి తండా ఎక్స్ రోడ్డు గ్రామంలో టీస్టాల్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో యూత్ అధ్యక్షులు జాదవ్ విశ్వనాథ్, హస్నాపూర్ సర్పంచ్ ఉపేందర్ లింగోజితండా సర్పంచ్ జాదవ్ హరినాయక్, నాగపూర్ సర్పంచ్ సునీల్ యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మెన్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని శ్రీ కేతేశ్వర కంకాలమ్మ శివాలయ రాక్ టెంపుల్ గుట్ట మహపూజ, జాతరకు ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్‌ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఉట్నూర్‌లోని జెడ్పీ చైర్మెన్ నివాసంలో కలిసి ఆహ్వానించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ నర్సింగరావు, చిలివేరి నర్సయ్య, పిల్లి మల్లయ్య కొడుజుట్టు రాజన్న, పర్ల కనకయ్య, ఒడిపల్లి రామన్న పర్ల శంకర్ ఉన్నారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఏఓ, ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామ కౌలు రైతు ఎడిపెల్లి రమేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్ ఏఓ, ఆర్డీఓకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ పంట దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చలేననే బెంగతో ఈనెల 10న తన నివాసంలో పురుగులమందు తాగి, ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డారని తెలిపారు. రమేష్ 12 ఎకరాల సాగుభూమిని కౌలుకు తీసుకున్నారని అందులో పత్తిపంటను సాగుచేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.8లక్షలు అప్పుచేశారని పేర్కొన్నారు. కేవలం ఎకరానికి 5 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చిందని పెట్టుబడి పెరిగిపోవడం, దిగుబడి రాకపోవడం, పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం మూలంగా నష్టం వచ్చిందన్నారు. చేసిన అప్పులు తీర్చలేని స్థితికి నెట్టివేయబడటం ఫలితంగా ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి మానవతా ధృక్పథంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన రమేష్ కౌలు రైతు కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. కుటుంబానికి 3 ఎకరాల సాగుభూమిని మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతు భద్రతా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. స్వామి నాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పిప్పల్‌కోటి శాఖ కార్యదర్శి ధోనిపెల్లి స్వామి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. శుక్రవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ మేరకు లింగాల చిన్నన్న మాట్లాడుతూ 6 నెలల నుంచి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కొత్త మెనూను సవరించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ అక్షయ పాత్రలాంటిదని స్వచ్ఛంద సంఘాలకు ఇవ్వరాదన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. అవసరమైన గ్యాస్ సబ్సిడీకి ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. వంటషెడ్లు, వంటపాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాం కల్పించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి స్పందించి వెంటనే బిల్లులు వచ్చే విధంగా చూడాలని అన్నారు. ఈ నిరసనలో కార్మికులు నాయకులు లక్ష్మి, రాజవ్వ, ప్రమీల, సంగీత, దేవత, జబ్బార్, భూదేవి ఉన్నారు.

బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని గ్రామాల్లో, పట్టణంలో ఇష్టారీతిన నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం మహిళలతో కలిసి ఆదిలాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం కోసం ప్రజలని మద్యానికి బానిసలను చేసి, వారి జీవితాలను నాశనం చేసిందన్నారు. ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులను పూర్తిగా తొలగిస్తామని హామి ఇచ్చిందని, బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించి, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఆమె వెంట నాయకులు పార్టీ నాయకురాలు సరిత, పలువురు మహిళలు ఉన్నారు.

స్నేహభావం పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్


క్రీడలతో స్నేహభావం పెంపొందించుకోవాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మనిషి మానసికంగా శారీరకంగా ధృడత్వం పెంపొందుతుందని అన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారులు ప్రశాంతమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని సూచించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, అడ్వొకేట్ బాణోత్ జగన్, ఎంపీటీసీ బాదావత్ కళావతి ఉత్తం నాయక్, సర్పంచ్ రాథోడ్ సునీత నారాయణ్, ఉపసర్పంచ్ అజర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, యూత్ సభ్యులు జాదవ్ జితేంధర్, జాదవ్ దత్త ఉన్నారు.

వందశాతం ఆన్‌లైన్ నమోదు చేయాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తులను వందశాతం ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కుష్బు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి విచ్చేసి ప్రజాపాలన ఆన్‌లైన్ నమోదును ఆమె పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం ద్వారా తీసుకున్న దరఖాస్తులను వందశాతం ఆన్‌లైన్ నమోదు చేసిన, సహకరించిన ఎంపీడీఓ చౌహన్ రాధాను, తహసీల్దార్ శంకర్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులను, ఆపరేటర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు బయలు దేరనున్న నాగోబా జాతర ప్రచార రథం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి పొందిన కేస్లాపూర్‌లోని నాగోబా జాతర వచ్చే నెల 9న మహాపూజతో ఆరంభం కానుంది. ఈ జాతర ప్రచారం కోసం మెస్రం వంశీయులు శనివారం గుమిగూడుతారు. నెల వంక కనిపించిన రెండో రోజు (ఆదివారం) వారి ఆచార సాంప్రదాయ పూజల అనంతరం ఛకడా (ఎడ్ల బండి) ద్వారా ప్రచారానికి బయలు దేరనున్నారని మెస్రం వంశీయులు తిరుపతి, ఉద్యోగ సంఘం నాయకులు మెస్రం మనోహర్‌లు తెలిపారు.

పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చింతల్‌చాంద గ్రామంలో శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం. పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాతి సంబరాలు నిర్వహించారు. అనంతరం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో మొదటి బహుమతి ఎస్ సునంద, రెండో బహుమతి జమున గెలుపొందారు. పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తుందని అన్నారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలను రెండో శ్రేణి పౌరులుగా మాత్రమే చూస్తున్నారని అన్నారు. మహిళలకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ప్రతిభకు తగిన గుర్తింపు దక్కాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనసూయ, సునంద, జమున గంగవ్వ, రాజవ్వ, మహిళలు పాల్గొన్నారు.

నిర్మల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి కవిత, రెండో బహుమతి గంగామణి, గెలుపొందారు. వీరికి పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి మొదటి బహుమతి అందజేశారు. రెండో బహుమతి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.లక్ష్మి అందజేశారు. మ్యూజికల్ చైర్‌లో మొదటి బహుమతి లక్ష్మి, రెండో బహుమతి తస్రీన్,లకు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కే.రాజన్న అందజేశారు. కార్యక్రమంలో అనసూయ, సునంద, జమున, గంగవ్వ రాజవ్వ, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా ట్రావెల్స్ యజమానికి అవార్డు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలకు విద్యార్థులను తీసువచ్చేలా గత కొన్నేండ్లుగా ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్న జీఎస్ఆర్ ప్రయివేట్ ట్రావెల్స్ యజమాని ప్రమోద్ కుమార్ ఖత్రికి జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందజేశారు.

కాగజ్‌నగర్ జిన్నింగు మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- 1500 క్వింటాళ్ల పత్తి దగ్ధం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద కాగజ్‌నగర్ జిన్నింగు మిల్లులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదంలో సుమారుగా 1500 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్టు తెలుస్తుంది. ట్రాక్టర్ బ్లేడుతో పత్తి ఒకే దగ్గరికి చేర్చే క్రమంలో క్రింద సిమెంటు రోడ్డుకు తగలడంతో నిప్పురవ్వలు పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ డ్రైవర్ యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను అదుపు చేశారు. సుమారుగా రూ.60 నుండి రూ.80 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈడెన్‌గార్డెన్ ప్రయివేటు పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బైజాజన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల యొక్క సాంప్రదాయమైన పండుగని, దీనిని రైతులు తాము పండించిన పంట చేతకందిన తర్వాత జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పండుగ ప్రత్యేకత ముగ్గులేనని, దీనిలో భాగంగా పాఠశాలలో విద్యార్థినిల్లో ఉన్న నైపుణ్యాన్ని, కలలను వెలికితీయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు

అన్ని గ్రామాలకు వికసిస్ భారత్



నవతెలంగాణ-బెజ్జూరు

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను గ్రామాల్లో వివరించి ప్రతి ఒక్కరు లబ్ది పొందాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం తుమ్మలగూడ గ్రామంలో వికసిస్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎల్‌సీడీ ద్వారా వివరించారు. గత ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని సక్రమంగా అమలుచేయలేదని, దీంతో రైతులు నష్టపోయారన్నారు. ఫసల్ బీమా పథకాన్ని అమలయ్యేలా చూస్తామని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మిస్తామన్నారు. అనంతరం డ్రోన్ ద్వారా పంట పొలాలకు ఎరువుల మందు పిచికారి చేసే విధానాన్ని రైతులకు చూపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చర్చలు సఫలం.. కార్మికులకు పెరిగిన వేతనాలు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు వేతనాలు పెంచాలని మూడు రోజుల నుండి కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయంలో చర్చలు జరిగాయి. కార్మికుల వేతనాలు పెరగడంతో కార్మికులు సమ్మెను విరమించి శుక్రవారం సెకండ్ షిఫ్టు నుండి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులు మూడు రోజుల నుండి వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 14 డిమాండ్లతో కూడి హక్కుల సాధన కోసం సమ్మె చేపట్టారన్నారు. చర్చల్లో ప్రస్తుతం ఇస్తున్న దానికంటే అదనంగా రూ.2 వేలు పెంచిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, దహణ సంస్కరణలకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. ప్రతి నెల కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికి రవాణా సౌకర్యం, తదితర హక్కులు సాధించుకున్నామని తెలిపారు. సమ్మెకు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, క్వాలిటీ మేనేజర్ రవి, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బొడ్డు లచ్చన్న, కార్యదర్శి రవి ప్రసాద్‌గౌడ్, రాజ్‌కుమార్, ప్రవీన్‌రావు, జితేందర్, రెబ్బెన సీఐ అల్లం నరేందర్, తిర్యాణి ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా జీజాబాయి జయంతి వేడుకలు

నవతెలంగాణ-కౌటాల

రాజ్‌మాతా జీజాబాయి, స్వామి వివేకానంద జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు దనోర్కర్ వసంత్‌రావు మాట్లాడుతూ ఆరె సంక్షేమ సంఘం హైందవ సామ్రాజ్య స్థాపకుడు, స్వరాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ తల్లి జీజాబాయి విలువిద్యలను నేర్పి మొదటి గురువైన రాజ్‌మాతా బిరుదు పొందిన జీజాబాయి జయంతిని ఘనంగా జరుపుకున్నామన్నారు. దేశంలో ఉన్నత పౌరుడిగా తీర్చిదిద్దడానికి మాతృమూర్తులే మార్గదర్శకాలన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ కోశాధికారి ఎలుములె దత్తు, సభ్యులు ఎలుములె మధూకర్, సునీల్, సోందాస్, నానాజీ, ప్రకాష్, బిక్కాజీ, రవి, బీజేపీ మండల నాయకులు పెద్దపెల్లి భీమన్న పాల్గొన్నారు.

ఎనిమిది మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని జాన్విజన్ కేర్ ఆస్పత్రిలో కౌటాల, చింతలమానెపెల్లి, బెజ్జూరు మండలాలకు చెందిన కంటి సమస్యలున్న గత మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో ఎనిమిది మందికి కంటి ఆపరేషన్లు అవసరముండడంతో వారిని ఆపరేషన్ కోసం లయన్స్‌క్లబ్ కొత్తపేట సహకారంతో బెల్లంపల్లిలో కంటి ఆపరేషన్లు చేయించి శుక్రవారం తిరిగి రావడంతో వారితో ఎలాంటి కంటి సమస్యలున్నా తమకు సమాచారం అందించాలని జేఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ నారాయణ్ సర్కార్, కంటి వైద్యాధికారి సీమా సర్కార్ తెలిపారు.

జగదాంబ దేవి మహా జాతర ప్రారంభం

నవతెలంగాణ-జైనూర్

లింగాపూర్ మండల కేంద్రంలో జగదంబ దేవి మహా జాతర శుక్రవారం ప్రారంభమైంది. లింగాపూర్ నాయక్ రాథోడ్ కిరణ్ నాయక్ ఆధ్వర్యంలో శ్రీ జగదంబ దేవి ఆలయ పూజారి రాథోడ్ మంగులాల్ మహారాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. గ్రామాన్ని చల్లంగా చూడాలని, జాతరలో ఎలాంటి ఆటంకాలు జరగకూడదని అమ్మవారిని మొక్కుకున్నారు. జాతర సందర్భంగా చిన్న, పెద్ద వ్యాపారస్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేస్రం గంగు పటేల్, జాదవ్ కైలాష్, జాదవ్ గణపత్ నాయక్, రాథోడ్ వినోద్ కుమార్, జాదవ్ జాదు, జాదవ్ రమేష్, ఆడే హాసిరామ్, జాదవ్ రమేష్, బాపురావు, వినోద్, రవీందర్, ప్రకాష్, కవిందర్, బాలు, అంబార్ సింగ్, అనిల్, ఏమిల్ ఉన్నారు.

సీనియర్ సిటిజన్స్ హక్కులను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్స్ చట్టం 2007 ప్రకారం హక్కులున్నాయని వాటిని వినియోగించుకోవాలని రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వయోధికుల సంతానం వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని, అది వారి బాధ్యతన్నారు. సరిగా చూసుకోపోతే ఇచ్చిన ఆస్తిని వాపసు తీసుకోవచ్చునని, బ్యాంకులలో రివర్సు మార్టుగేజ్ సౌకర్యం ప్రకారం భార్యాభర్తలు బ్రతికినంతకాలం డబ్బులు సమకూర్చే సదుపాయం కలుగుతుందన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష ఖరారు చేస్తూ ఆసిఫాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి యువరాజ్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ అధికారి సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజన్ లైజనింగ్ అధికారి బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో హత్యాయత్నం చేసిన తోగరం పరదేశికి పోలీసులు ప్రవేశపెట్టిన సాక్షులు ఆధారంగా 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితునికి శిక్ష వేయించడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

వివేకానంద మార్గంలో యువత ముందుకు సాగాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



కాగజ్‌నగర్: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

యువత స్వామి వివేకానంద చూపిన మార్గంలో పయణిస్తూ తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. పట్టణంలోని సర్ సిల్క్ రామకృష్ణ వివేకానంద సెంటర్‌లో స్వామి వివేకానంద 162వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం రామకృష్ణ వివేకానంద సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివేకానంద మార్గదర్శనంలో యువత ముందుకు సాగాలని, వారి జయంతిని జాతీయ యువజనోత్సవంగా జరుపుకోవడం సముచితమని తెలిపారు. యువత వివేకానందను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తును పదిలంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీ శైలం, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ దెబ్బటి శ్రీనివాస్, బాల్క శ్యామ్, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, సుమీత్, మోహన్ నాయక్, కౌశిక్ బట్టాచార్య, సౌరభ్ ధాత్రక్, మహేష్ సింగ్, మహేష్ సర్కార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాగ్రి పంపిణీ

పట్టణపద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్సిల్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నం అశోక్, కుందారపు రాజు, హరి, వినోద్, వినయ్, శ్రావణ్, సాయి, సంతోష్ పాల్గొన్నారు.

బెజ్జూరు : మండలకేంద్రంలోని ఆదివాసీ భవనంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సులుగుపెల్లి ఉప సర్పంచ్ సంతోష్, బీజేపీ నాయకులు సామల తిరుపతి, శ్యాంసుందర్, రాకేష్, తిరుపతి పాల్గొన్నారు.



బెజ్జూర్‌లో..వివేకానందునికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే పాల్వాయి



వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బెజ్జూరు

పంచవర్ష ప్రణాళికతో ప్రతి సంవత్సరం 20 శాతం నిధులను వెచ్చిస్తూ అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటలమానెపెల్లి గ్రామంలో కుమురం భీం స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామాలను గాలికి వదిలేసిందని, గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులే వచ్చాయన్నారు. కేంద్ర సహకారంతో ఐదు సంవత్సరాలలో గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా స్పందించిన ఆయన స్టేడియం ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. తన గెలుపు కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మొదటిసారి కుంటలమానెపెల్లి గ్రామానికి ఎమ్మెల్యే రావడంతో గ్రామస్తులు భాజాభజంత్రీలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్ల రామయ్య, ఉమ్మరి బాలకృష్ణ, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, గూడ రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

జంగుబాయి దీక్షతో ఎన్నో లాభాలు : ఎంపీ సోయం

- ప్రారంభమైన జంగో లింగో దీక్ష

నవతెలంగాణ-జైనూర్

జంగోలింగో దీక్ష ద్వారా ఎన్నో లాభాలుంటాయని, నేటి ఆదివాసీ యువత దీక్షను చేపట్టాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు సోయం బాబురావు అన్నారు. శుక్రవారం మండలంలోని జంగాం గ్రామంలో జైజంగో, జైలింగో ఆదివాసుల దీక్ష స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసులు పెద్దఎత్తున దీక్షను స్వీకరించారు. దీక్షలో ప్రత్యేక పూజలు నిర్వహించి 40 రోజుల పాటు ఒక్కపూట భోజనం స్వీకరిస్తారన్నారు. జైజంగో జైలింగో దీక్షతో తమ జీవితాన్ని మార్చడం జరిగిందని, దీక్ష ద్వారా ఆదివాసుల్లో ఎంతో చైతన్యం వస్తుందని కొనియాడారు. వేలాది మంది మహిళలు, యువత దీక్షను స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున ఆదివాసులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, ఆదివాసీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



జంగుబాయి దీక్ష పూజల్లో పాల్గొన్న ఎంపీ సోయం బాపురావ్

చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి



నవతెలంగాణ-జైనూర్

నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావు, సిర్పూర్(యు) ఎస్సై రాజు అన్నారు. శుక్రవారం సిర్పూర్(యు) మండలంలోని నెట్నూర్(బి) గ్రామంలో ఆంజనేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకుల్లో దాగివున్న నైపుణ్యాన్ని క్రీడల ద్వారా వెలికితీయడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. గ్రామస్థాయి నుండి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించడానికి పోటీలు వేదికలుగా మారుతాయన్నారు. క్రీడల్లో ఆడి గ్రామాలకు మంచిపేరు తీసుకువచ్చి ఉన్నతస్థాయికి వెళ్లాలని యువతను ప్రోత్సహించారు. గ్రామస్థాయిలో నిర్వహించబోయే క్రీడలను స్నేహభావంతో ఆడాలని సూచించారు. అనంతరం సంస్కృతి సాంప్రదాయాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.

జీజాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

జీజాబాయి తన కుమారుడు ఛత్రపతి శివాజీకి బాల్యం నుండే ధైర్యసాహసాలు ఆమె పిరికితనాన్ని నూరిపోయకుండా ధైర్యసాహసాలు, యుద్ధ నైపుణ్యాలు నేర్పించిన మహత్యాగశీలి జీజియాబాయి అని ఆరెకుల మండల అధ్యక్షుడు చంకపూరి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జీజియాబాయి 426వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజియాబాయి నాటి కాలంలో అట్టడుగుస్థాయిలో ఉన్న కులాలను పెత్తాందారులు, అగ్రకులస్తులు పెట్టిన అనేక ఇబ్బందులు చూసి చాలా బాధపడిందన్నారు. అణగారిన వారిని కాపాడుకోవాలని ధైర్యం తన కుమారుడికి దేశభక్తిని నూరిపోసి ధర్మాన్ని రక్షించాలని ఛత్రపతి శివాజీకి స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెకుల సంఘం గౌరవధ్యక్షుడు ఎలుములె శంకర్, ఉపాధ్యక్షుడు బొక్కిపెల్లి మోహన్, కిరుమరె శ్యాంరావు, జెడ్పీటీసీ నేరేటి రేఖా సత్యనారాయణ, ఉప సర్పంచ్ తోట మహేష్, ఎంపీటీసీ సరిత కిశోర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవితం ఆదర్శప్రాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో అంబేద్కర్ జీవితంపై నాటకం ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. దేశ దిశను నిర్దేశించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఆయనను కీర్తించాల్సిన అవసరముందన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ రావు, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్, బీసీ రైతు సంఘం అధ్యక్షులు వైరాగడే మారుతి పటేల్, మైనారిటీ నాయకులు ముజాయిద్ పాల్గొన్నారు.



ఎస్పీని కలిసిన టీఎన్జీవోస్ యూనియన్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలంను టీఎన్జీవోస్ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సంద అశోక్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎస్పీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్, తిరుమల్ రెడ్డి, మురళి, గంగాధర్, దేవేందర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్ పాల్గొన్నారు.

జిల్లా యువ కవి, కళాకారుడు భీమేష్‌కు నేషనల్ ప్రీమియర్ అవార్డు



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ సారస్వత పరిషత్తు వేదికగా హైదరాబాద్ నేషనల్ ప్రీమియర్ అవార్డ్‌ను రవిశ్రీ యూనివర్సిటీ వారు గురువారం రాత్రి మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన యువ కవి, కళాకారుడు పోలీస్ భీమేష్‌కు పురస్కారాన్ని ఐఏఎస్ అధికారి చింతల శ్రీనివాస్, జబర్దస్త్, సినీమా నటుడు షేకింగ్ శేషుఅందించారు, సామాజిక మాధ్యమాల్లో తనదైన శైలిలో రచనలు చేస్తున్నందుకు, ఈ ప్రిమియర్ అవార్డు అందిస్తున్నట్టు నిర్వహకులు పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా ఈ యువ పురస్కారం రావటం ఆనందంగా ఉందని భీమేష్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కవులు, కళాకారులు శుక్రవారం భీమేష్‌కు అభినందనలు తెలిపారు.

రాములోరి అక్షింతలు సేకరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అయోధ్యలోని రాములోరి గుడి విగ్రహ ప్రతిష్టాపన కోసం మండల కేంద్రంలో శుక్రవారం అక్షింతల సేకరణను రాంసింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో కొనసాగింది. జ్వాలా ముఖి ఆలయం పీఠాధిపతి రాంసింగ్ మహారాజ్ అందుతండ నుంచి భక్తులచే మండల కేంద్రం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన కలశాన్ని పెట్టుకొని రాధా కృష్ణ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ నుంచి ప్రముఖ వీధుల గుండా భక్తుల నుంచి అక్షింతలను సేకరించారు. ఈ కార్యక్రమంలో దీపక్‌సింగ్ శేఖావత్, ఫడ్ విశ్వనాథ్, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-కౌటాల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపెల్లి గ్రామంలో వికసిస్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వీడియో మొబైల్ వ్యాన్ ద్వారా గ్రామంలో ప్రత్యక్షంగా చూపించారు. కేంద్ర ప్రభుత్వ పీఎం నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పథకాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వివరించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సోయం సురేష్, వికసిస్ భారత్ జిల్లా కన్వీనర్ సమీర్ గుప్తా, తాలుకా కోకన్వీనర్ ప్రశాన్‌జిత్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

శ్రీనివాస టెక్నికల్ ఎడ్యూకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉష మిషన్ కంపెనీ సహకారంతో మహిళలకు పలురకాల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఆర్ఓ రమేష్ రాథోడ్, ఉష కంపెనీ రాష్ట్ర మేనేజర్ రాజ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు స్వయం ఉపాధితో పాటు ఆత్మరక్షణపై ఉష మిషన్ కంపెనీ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు స్వయం ఉపాధితో పాటు గ్రామీణ క్రీడాలు, ఆత్మరక్షణ క్రీడాల్లో రాణించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కంపెనీ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | జనవరి 13, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన దేవాపూర్ ఓసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-కాసిపేట



బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను హైదరాబాద్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ నేతృత్వంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధ్యక్షుడు సత్య ప్రతాశర్మ కలిశారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమావేశమై సమస్యలను తెలియజేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ మండల అభివృద్ధి, కార్మికుల శ్రేయస్సు కోసం కలిసి పని చేసి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో లోడింగ్ కార్మికులు భారతని సతీష్, కృష్ణ, పన్నాల రమేష్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



వాకర్ క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బొప్ప సతీష్ నేతృత్వంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఒక ప్రముఖ వ్యక్తి వివేకానంద అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సతీష్, తిరుపతి, స్వామి, మల్లేష్, వెంకటరమణ, సత్తయ్య, పుండరీకం, రిటైర్డ్ తహసీల్దార్ సత్తయ్య, వాకర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల వైపే కాకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పెరుగు సుధాకర్ ఏర్పాటు చేసిన యానిమేషన్ క్రియేషన్స్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి ఆలోచనలతో స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్నారు. ఆర్ట్ అండ్ క్రియేషన్స్ యానిమేషన్స్ ద్వారా ఎంతోమందికి ఉపాధి కలిగించవచ్చున్నారు. దీన్ని మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ ఏర్పాటు చేసిన పెరుగు సుధాకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం జిల్లా నాయకులు, ఏనుగు సుభాష్ రెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, రజాక్, పసియుల్లా, దాముఖ కరుణాకర్, ఎంఈఓ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు జాడి రాజన్న, తుంగురి గోపాల్, రామటెంక శ్రీనివాస్, కూకటికారి బుచ్చయ్య, రేండ్లగూడ సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్, బండారి స్వామి, రఫీ ఉల్లా, నందు నాయక్, పంకజ పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద రిజిస్టర్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా జపాన్, జర్మనీలలో పని చేయుటకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లొమా పూర్తి చేసి 22-30 సంవత్సలరాల వయస్సు గల వారు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 1.5 లక్షల నుండి రూ. 1.8 లక్షలు ఇస్తారన్నారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటిషిప్ ప్రోగ్రామ్ కోసం ఇంటర్మీడియట్‌లో 60 శాతం, అంత కంటే ఎక్కువ మార్కులు సాధించి 18-28 సంవత్సరాలు వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని, శిక్షణ సమయంలో నెలకు రూ.1 లక్ష స్టైఫండ్, నియామకం తరువాత నెలకు రూ.3 లక్షల వేతనం ఉంటుదన్నారు. జపనీస్, జర్మన్ భాషలపై రెసిడెన్షియల్ శిక్షణ, పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తి పరమైన నైపుణ్యాలు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తారన్నారు. అభ్యర్థులు తమ రెస్యూమ్‌ను టామ్‌కామ్.జర్మనీ ఎట్‌దరేట్‌ఆఫ్‌జిమెయిల్‌కు మెయిల్ పంపాలన్నారు. వివరాలకు 8919047600, 6302292450, 9573945684లలో సంప్రదించాలన్నారు.

కాక స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

ఉమ్మడి మండల పరిధిలో గడ్డం కళావతి వెంకటస్వామి (కాక) స్మారక క్రికెట్ పోటీలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఇందారం-టేకుమట్ల శివారుల్లో మండల అధ్యక్షులు ఫయాజోద్దీన్, యూత్ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీకాంత్‌తో కలిసితో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో జైపూర్, భీమారం మండలాల పరిధిలోని 33 జట్లు పాల్గొంటున్నాయి. క్రీడాకారులకు నాయకులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల సర్పంచ్ గోనె సుమలత నర్సయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ శేఖర్, మండల కోఆప్షన్ సభ్యులు జైనోద్దీన్, ఎస్టీ సెల్ నాయకులు పాత ప్రశాంత్, రాకేష్, బల్ల వెంకటేష్, బల్ల రమేష్, జలంపల్లి మల్లేష్, ఎన్నం అశోక్, గోదారి నర్సయ్య, నారాయణ, రవీందర్ గౌడ్, ఈగ సురేందర్ పాల్గొన్నారు.

ఊరు విడిచి వెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించాలి..!

నవతెలంగాణ-జైపూర్



సంక్రాంతి పండుగ సంధర్భంగా ఊరు విడిచి వేరే వెలుతున్న కుటుంబాల వారు జాగ్రత్తలు పాటించాలని శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ సర్కిల్‌లోని జైపూర్, భీమారం మండలాల పరిధి ప్రజలు పండుగ సంధర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు స్వీయరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తులు కన్పిస్తే డయల్100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్తున్న వారు విలువైన వస్తువులు బంగారం, వెండి అభరణాలతో పాటు నగదు వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. అదే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నస్పూర్ : సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లేవారు పోలీసు సూచనలతో జాగ్రత్త పడాలని సీఐ జి రమేష్ బాబు అన్నారు. సంక్రాంతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, విహారయాత్రలకు, ఊరికి వెళ్లేటప్పుడు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టొద్దని,స్వీయ రక్షణకు ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని అన్నారు. న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలని, వాటిని గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశముందన్నారు.

వార్షిక అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయం

- మంచిర్యాల కలెక్టర్ సంతోష్



అవార్డుకు ఎంపికైన పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడికి పూలమొక్క అందిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నస్పూర్

వ్యవసాయ రంగంలో కృషిని గుర్తించి, తదుపరి ప్రయత్నాలను ప్రేరేపించడానికి వివిధ విభాగాలలో ఏరువాక ఫౌండేషన్ అందించే ప్రతిష్టాత్మకమైన ఏరువాక వ్యవసాయ వార్షిక అవార్డులకు జిల్లా అధికారి ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో వార్షిక అవార్డుకు ఎంపికైన జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా. వై. రమేష్ కుమార్‌కు మొక్కలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్న వ్యవసాయ కళాశాలలు, అనుబంద విభాగాలలో వ్యవసాయ కంపెనీలు, కేవీకేలలో పని చేస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు, పాత్రికేయులు, అగ్రి యాప్స్, సామాజిక మాధ్యమాల నిర్వాహకుల, సృజనాత్మక రైతుల విశిష్టమైన సేవలను ఏరువాక ఫౌండేషన్ గుర్తించి ఈ అవార్డులను అందిస్తుందన్నారు. ఈ సంవత్సరం ఉత్తమ శాస్త్రవేత్త విభాగంలో పశువైద్య విస్తరణ నిపుణులుగా ఎంపికయ్యారన్నారు. 20, 21 తేదీలలో మేడ్చల్‌లోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్-దూలపల్లిలో అవార్డు స్వీకరిస్తారన్నారు.

అతి వేగంతో వెళ్తే జరిమానా.. రహదారిపై స్పీడ్ గన్ ఏర్పాటు



ఇందారం ఎక్స్ రోడ్డు కూడలి

నవతెలంగాణ-జైపూర్

జాతీయ రహదారి 63తో పాటు రాజీవ్ రహదారుల మీదుగా అతి వేగంతో వాహనాలు నడిపితే జరిమాన విధించడానికి ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద స్పీడ్ గన్ ఏర్పాటు చేసి 63వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా మంచిర్యాల-చెన్నూర్ మధ్య నడిచే వాహనాల స్పీడును గుర్తించనున్నారు. ఈ రహదారుల్లో ఆర్అండ్‌బీ శాఖ ఏర్పాటు చేయనున్న స్పీడ్ లిమిట్ పరిధిలో ప్రయాణాలు కొనసాగాలని హెచ్చరిస్తూ ఈ రహదారుల మీదుగా స్పీడును నిర్ధారించారు. ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించడం కోసం మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయానికి వాహనదారులు సహకరించాలని కోరుతున్నారు. ఇందారం ఎక్స్ రోడ్డు మీదుగా మంచిర్యాల-చెన్నూర్ మధ్య 60 కిలో మీటర్, రాజీవ్ రహదారిపై 80 కిలో మీటర్ల స్పీడ్ లిమిట్ పాటించాలని సూచిస్తున్నారు. మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్ అధికారులు తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో అతి వేగంతో వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలి.

సీఎండీని కలిసిన సింగరేణి కళాకారులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న పర్మనెంట్ ఉద్యోగ కళాకారుల పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఎండీని కలిసి వినతిపత్రం అందించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఎండీని హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కళాకారుల సమస్యలపైన ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు సాధనవేణి ప్రభాకర్, కార్యదర్శి పులియాల సతీష్, శ్రీరాంపూర్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, కార్యదర్శి రాజేశ్వరరావు, సలహాదారులు గవ్వంపల్లి స్వామి, గజ్జెల రాయలింగు, కళాకారులు రాకేష్ పాల్గొన్నారు.



సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సింగరేణి కళాకారులు

ఆర్కెపల్లి శివారు భూములకు సాగు నీరందించాలి



గొల్లవాగు ప్రాజెక్టు కెనాల్ పరిస్థితులు వివరిస్తున్న రైతులు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పోతన్‌పల్లి శివారులో గొల్లవాగుపై నిర్మించిన ప్రాజెక్టు నీటిని ఆర్కెపల్లి శివారు వ్యవసాయ పంట పొలాలకు అందించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయకట్టు రైతులు శుక్రవారం ప్రధాన కాల్వ పరిస్థితిని వివరించారు. గొల్లవాగు ప్రాజెక్టు నుండి మొదలు ఆస్నాద్ వరకు 29 కిలో మీటర్ల పొడవుతో ప్రధాన కాల్వ నుండి విడుదల చేస్తున్న నీరు ప్రాజెక్టు మొదట్లో గల ఆర్కెపల్లి శివారుకు అందడం లేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు ముందు ఏర్పాటు చేసిన జీరో పాయింట్ నుండి నీటిని సమకూర్చాల్సిన సంధర్భంలో నీరు పంట పొలాలకు చేరకపోవడం సమస్యగా మారిందన్నారు. ఆర్కెపల్లి శివారు భూములకు గొల్లవాగు ప్రాజెక్టు నీటిని సమకూర్చాలని కొంత కాలంగా అభ్యర్థిస్తున్నా పాలకులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రైతులతో కలిసి ప్రాజెక్టు కాల్వను పరిశీలించిన నాయకులు స్థానిక స్థితిగతులను ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చేకుర్తి సత్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ భానోత్ అమర్ సింగ్ నాయక్, తగరం రాజకుమార్, పిట్టల మదునయ్య, థావిర్యా నాయక్ పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

నవతెలంగాణ-బేల

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వివేకానంద 161వ జయంతి కార్యక్రమంలో పాల్గొని స్వామి వివేకానందకు నివాళులర్పించారు. యువత వివేకానంద అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్ రెడ్డి, ఓం ప్రకాష్, మురళీధర్ ఠాక్రే, దత్తా నిక్కం, సర్పంచ్ రాకేష్, సందీప్ ఠాక్రె, ప్రీతం, సూరజ్, పవన్ రెడ్డి, సాయి పాల్గొన్నారు

మండలంలో..

మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాల లో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వరప్రసాద్ రావు మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడవాలన్నారు. అంతకు ముందు స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాల వేసి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్, ఆమోల్ సాగర్,కిష్టారెడ్డి, సంజీవ్, కళాశాల సాంస్కృతిక ఇన్‌చార్జి పుష్ప, బిందు, ప్రియాంక, సౌందర్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



నవతెలంగాణ బోథ్

మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లకు ఏర్పాటుచేసిన సమావేశంలో తాసిల్దార్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ తమ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు ఉంచాలన్నారు. అలాగే జనవరి 31 వరకు ఈ కేవైసీ నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని రేషన్ షాపులో బినామి రేషన్ డీలర్లు ఉండకూడదని అన్నారు .ఎక్కడైతే బినామీ రేషన్ డీలర్లు ఉన్నట్లయితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ మల్లేష్, ఆర్ ఐ లు చంద్రశేఖర్, సునీత, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ మై, రేషన్ డీలర్లు ,పాల్గొన్నారు.

ఔషధ మొక్కలను పెంచాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తరిగిపోతున్న వృక్ష సంపదతో పాటు ఔషధ మొక్కలను అందరు పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. శుక్రవారం కవి, రచయిత, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ కమ్మల నర్సింహులు ఔషధ మొక్కలను నాటి రక్షించగా ఆ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఓ పాఠశాలలో నిర్వహించారు. ప్రముఖ కవి ఉదారి నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం నర్సింహులును అదనపు కలెక్టర్ శాలువతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు లక్ష్మారెడ్డి, నరసింహులు, కవులు సాయిప్రియ, త్రివేణి, లక్ష్మీనారాయణ, గంగన్న పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో రాములు తెలిపారు. శుక్రవారం నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కౌన్సిల్‌లో 25 మంది సభ్యులు ఉండగా 19మంది సభ్యులు హాజరయ్యారని తెలిపారు. చైర్మన్‌పై ప్రతిపాదించబడిన అవిశ్వాస తీర్మానంపై సమ్మతి తెలుపుమని కోరగా 19 మంది సభ్యులు సమ్మతి తెలపడం జరిగిందని, అవిశ్వాసం నెగ్గడానికి కావాల్సిన మొత్తం సభ్యులలో 2/3(17మంది) మంది సభ్యులు కావాల్సి ఉండగా 19 మంది సభ్యులు ఓటింగ్ బలపరచడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-జన్నారం

ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్నతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా, వైద్యం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలన్నారు. జీఓ 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, జిల్లా మారిన స్పౌజ్ ఉపాధ్యాయులకు ఒకే జిల్లాకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న, మండల విద్యాధికారి విజయకుమార్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ముంజం మల్లేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీనివాస్, బి.రాజన్న, మండల అధ్యక్షులు తుంగూరి గోపాల్, కుకటికారి బుచ్చయ్య పాల్గొన్నారు.

పోలీసులకు ఉద్యోగోన్నతి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ఉద్యోగోన్నతులు పొందారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో సీపీ రెమో రాజేశ్వరి ఉద్యోగోన్నతి పత్రాలు అందుకున్నారు. జైపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏజాజ్ ఏఎస్ఐ, కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతి హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో వివిధ ఏరియాలలో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న 08 మందికి ఎస్సైలుగా, హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న 10 మంది ఏఎస్ఐలుగా, కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న 19 మందికి ఏఎస్ఐలు ఉద్యోగోన్నతి పొందారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి పదవీ బాధ్యత పెరుగుతుందని, విధుల పట్ల శ్రద్ధ కలిగి ఉండి పోలీస్ శాఖ గౌరవంతో పాటు నమ్మకాన్ని పెంపొందించాలని సీపీ సూచించారు.

17 నుంచి జీపీ అభివృద్ధి ప్రణాళికలకు గ్రామసభలు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల వారిగా అభివృద్ధి ప్రణాళికల కోసం 17 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17 నుండి 20 వరకు సభలు జరుగుతాయన్నారు. 17న ధర్మారం, దాంపూర్, ఖాజీపల్లి 18న నర్సింగాపూర్, భూర్గుపల్లి, పోలంపల్లి 19న మద్దికల్, ఎల్కేశ్వరం, కొత్తపల్లి 20న ఆరెపల్లి, భీమారంలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆదర్శంగా తీసుకుంటు ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు గాలిపటాలను ఎగరవేసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | జనవరి 13, 2024 | www.navatelangana.com

ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రామకష్ణాపూర్

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ 52వ జన్మదిన వేడుకలను పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలిగిరి కనకరాజు, గండి కుమార్‌గౌడ్, పల్లె దినేష్, వేల్పుల మల్లేష్, మహిళ నాయకురాలు ఎదుల్ల కమల, నాగుల శారద, కన్నూరి రాజేందర్, రామ్‌సాయి, చొప్పదండి నవీన్, భునగిరి రవీందర్, బానేష్, ప్రకాష్ పాల్గొన్నారు.



ఘనంగా జీజాబాయి జయంతి

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తాలో ఆరెకుల సంఘం మండల అధ్యక్షులు టోబ్రే శ్రీనివాస్ దర్శకత్వంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి మాత జీజాబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. మాత జీజాబాయి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య ఆరె కుల సంఘ రాష్ట్ర కార్యదర్శి డుబ్బుల వెంకన్న, సంఘ నాయకులు రాజన్న, శ్రీమాన్ నారాయణ, శంకర్, సత్తయ్య పాల్గొన్నారు.



సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములను పరిశీలించిన కలెక్టర్



ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాంలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల కోసం 8000 మెట్రిక్ టన్నుల నూతన ఎఫ్‌సిఐ పాయింట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం హమాలీలు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు తప్పుల్లేకుండా ఎంట్రీ చేయాలి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీ నమోదును అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా పరిశీలించారు. దరఖాస్తులు తప్పులు లేకుండా కంప్యూటర్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రేషన్ కార్డు నెంబరు సరిచూసుకొని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంపీఓ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు గుర్తించి పరిష్కరించాలి

మండల కేంద్రంలో సమస్యలున్నాయని, గుర్తించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు నాయకులు వినతిపత్రం అందజేశారు. లక్షల రూపాయల వేలం పలుకుతున్న సైబజార్‌లో కనీస వసతులు లేవన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే జనాలకు నీటి వసతి, మూత్ర శాలలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారసంతలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల వెంకటేష్, షేక్ ఆబిద్, షేక్ నాసర్ అహ్మద్, సల్ల రవి, గడ్డల నారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల రక్షణే తుడుందెబ్బ లక్ష్యం

ఆసిఫాబాద్ : ఆదివాసీ హక్కుల రక్షణే తుడుందెబ్బ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్ కుమార్ అన్నారు. జిల్లా కార్యాలయంలో వాంకిడి, ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాలతో కూడిన డివిజన్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలన్నారు. తుడుందెబ్బ ప్రధాన లక్ష్యమే ఆదివాసీల హక్కుల రక్షణ అని, దాన్ని ఎప్పుడు మరవకూడదన్నారు. క్షేత్రస్థాయిలో ఆదివాసులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూనే వారిని నిరంతరం చైతన్యం చేస్తామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కమిటీలో కొన్ని మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెడ్మ భగవంతరావ్, జిల్లా ఉపాధ్యక్షులుగా పెందూర్ ధర్ము నియమిస్తున్నట్లు వివరించారు అదేవిధంగా డివిజన్ అధ్యక్షులుగా గేడం సుభాష్, ప్రధాన కార్యదర్శిగా కోట్నక రాంషావ్ నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ మారుతీ, తిర్యాణి మండల తుడుందెబ్బ అధ్యక్షులు ఆత్రం గోపాల్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోట్నక ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యాసంస్థల ఏర్పాటు సీఎం దృష్టికి తీసుకెళ్లాలి



ఆసిఫాబాద్ : జిల్లాలో సాంకేతిక విద్యా సంస్థల ఏర్పాటు అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, నిరుద్యోగ విద్యార్థి జిల్లా కన్వీనర్ పొన్న రమేష్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో సాంకేతిక విద్య సంస్థ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తిర్యాణిలో కళాశాల ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరగా సాంకేతిక విద్యా సంస్థ ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిసిసి అధ్యక్షుడు సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్, ఎండి ముజంబిల్, ఎన్నం శ్రీకాంత్, రశీద్ పాల్గొన్నారు.

17న రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్ : ఈ నెల 17న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే రుణ మేళాను మహిళ సంఘాలు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని డిపిఎం నరేందర్ సూచించారు. శుక్రవారం భీంపూర్ గ్రామీణ బ్యాంక్‌లో మేనేజర్, ఎపిఎం రమేష్, ఐకెపి సిసిలతో కలిసి సిబిఆర్ఎం సమావేశం నిర్వహించారు. ఎన్‌పిఏలో వచ్చిన సంఘాలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు. అర్హులైన సంఘాలకు ఎంసిపి బ్యాంక్‌లో అందించిన తరువాత వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో బ్యాంక్ సిబ్బందితో పాటు సిసిలు కిషన్, సంతోష్, చంద్రకాంత్ వివఓ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఆధార్ లింకు ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ఆధార్ అనుసంధాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు నష్టం చేసే ఆధార్ అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ఉపాధి హామీ పథకం నీరు గారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష పార్టీల ఒత్తిడితో అప్పటి యూపీఏ ప్రభుత్వం 2005లో ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడమేనని దీని లక్ష్యమన్నారు. వలసలను నిరోధించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలకు వరం లాంటిదని రైతులకు, కూలీలకు, గ్రామీణ ప్రాంతా పేదలకు ఇది ఎంతో మేలు చేసిందని అభిప్రాయపడ్డారు. అప్పటి చట్టం ఉద్దేశం మంచి దైనప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాన్ని అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఇప్పుడు ఏకంగా ఈ చట్టాన్ని రద్దు చేసే కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. దీన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఉపేక్షించదని, పరిరక్షణకు భవిష్యత్తులో సంఘాల సహకారంతో ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. గిరిజనులు, దళితులు సుమారు 60 శాతం పైగా నివసిస్తున్న జిల్లాలో వ్యవసాయం ప్రధానమైనదన్నారు. సుమారు 2 లక్షల13వేల 508 మంది జాబ్ కార్డుండి పనులు చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తి కావోస్తోందని, ఉపాధి హామీ పథకం నిధులను ఏటా తగ్గిస్తూ వస్తుందని మండిపడ్డారు. కఠిన ఆంక్షలు పెట్టి కూలీల సంఖ్యను తగ్గిస్తుందని ప్రతి రోజు రెండుసార్లు కూలీల ఫోటోలు పంపాలని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పనిచేయాలని వేధిస్తోందన్నారు. సదరు కూలీలకు మాత్రం రూ.60 నుంచి 70 మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు కూలీ చెల్లించాలంటే ఆధార్ అనుసంధానం కార్మికులు విధిగా చేసుకోవాల్సిందేనని కొత్త నిబంధన తెచ్చారన్నారు. దీంతో జిల్లాలో 25 నుంచి 30 వేల ఉపాధి కూలీలు పనికి దూరమయ్యే కుట్ర జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి ఉపాధి హామీ కూలీల ఆధార్ అనుసంధాన నిబంధనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ మావేశంలో సీఐటీయూ నాయకులు దర్శనాల మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండి దత్తాత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సక్కు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, నాయకులు జమున, మంజుల, లింగాల చిన్నన్న, ఎస్.స్వామి పాల్గొన్నారు.



యువత సన్మార్గంలో నడవాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వివేకానంద ఆలోచనలను ఆచరణలో పెట్టి యువత సన్మామార్గంలో నడవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం నేహ్రు యువ కేంద్రం ఆధ్వర్యంలో రిమ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రిమ్స్ ఆవరణలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆడిటోరియంలో వివేకానంద చిత్రపటానికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు వివేకానంద అని కొనియాడారు. బలమైన కోరిక ఉంటే అన్ని అవయవాలు వాటి సాధనకు సహకరిస్తాయన్నారు. సమాజంలో మంచి, చెడు రెండు ఉంటాయని, అందులో మంచి వైపే యువత అడుగు వేయాలన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుంటు మంచి లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. భారతదేశం శక్తివంతమైన దేశంగా ఎదుగుతుందని, యువత కూడా వారి భాగస్వామ్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ ఇద్రిస్ అక్బానీ, ఎన్‌వైకె యువజన అధికారి సుశీల్ బడ్, వైద్యులు కళ్యాణ్‌రెడ్డి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

వివేకానందచౌక్‌లో..

పట్టణంలోని వివేకానంద చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవీతో పాటు ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహ శిల్పకర్త ఊరే గణేష్‌తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విగ్రహ ఏర్పాటుకు సహకారం అందించిన వారిని సన్మానించి మెమోంటోను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అదనపు కలెక్టర్‌ను యువజన సంఘాల తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, యువజన సంఘాల ప్రతినిధి బాలశంకర్ కృష్ణ, అర్పాత్ పాల్గొన్నారు.



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో జనవిజ్ఞాన వేదిక శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడం జరుగుతుందన్నారు. దేశం కీర్తి ప్రతిష్ట ప్రపంచ దేశాలకు వివరించి దేశ గొప్పతనాన్ని నిలబెట్టిన వ్యక్తి అని పేర్కొన్నారు. మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ జ్యోతిష్యాన్ని కూడా నమ్మకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, కోశాధికారి శ్రీధర్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఉమాకాంత్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..



డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జాకీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దయాకర్, ఎండి అశ్రఫ్ అలీ, ప్రోగ్రాం వాలంటీర్స్, ఇతర అధ్యాపకుల బందం పాల్గొన్నారు.

ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో

పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివేకానందుడి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అనుకున్న లక్ష్యాలను సాదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలో స్వామి వివేకానంద 161 జయంతిని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు హిందువాహిని ఆధ్వర్యంలో అన్నాబాహు సాటే, స్వామి వివేకానంద, భగత్‌సింగ్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోరి పోతన్న, తాటివార్ రమేష్, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, సోమేశ్ పటేల్, మాజీ ఉపసర్పంచ్ దశరథ్, ధర్మపురి శ్రీనివాస్, పోతన్న గడ్డం అనిల్ పాల్గొన్నారు.

ఎంపీపీ పీఠం బీజేపీ కైవసం

నవతెలంగాణ-భైంసా

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి పరేషాన్‌లో ఉన్న బిఆర్ఎస్‌కు మరో గట్టి షాక్ తగిలింది. టిఆర్ఎస్ నుంచి గెలిచిన ఎంపీపీ కల్పనా గణేష్, వైస్ ఎంపీపీ గంగాధర్ వారం రోజుల క్రితం రాజీనామా చేయడంతో అధికారులు ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి క్రాంతి కుమార్ కుమార్ సమక్షంలో ఎన్నికలు జరిగాయి. ఎంపీపీగా మిర్జాపూర్ ఎంపిటిసి అబ్దుల్ రజాక్‌ను వానల్పాడు ఎంపిటిసి కల్పన ప్రతిపాదించారు. కోతుల్‌గాం ఎంపిటిసి బలపరచడంతో పోటీలో ఎవరు లేకపోవడంతో ఎంపీపీగా అబ్దుల్ రజాక్ ఎన్నికయ్యారు. అదేవిధంగా వైస్ ఎంపీపీగా కామల్ ఎంపిటిసి నర్సారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం 11 గంటలకు ఎంపిటిసిలంతా బిజెపి కండువాలు కప్పుకొని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ రజాక్ మాట్లాడుతూ తాను ఎన్నో సంవత్సరాలుగా గడ్డెన్న కుటుంబానికి సన్నిహితంగా ఉన్న తనకు ఎంపీపీ పదవి ఇస్తానని ఎమ్మెల్యే విట్టల్‌రెడ్డి, అతని సోదరుడు సూర్యంరెడ్డి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మైనార్టీ అయిన తనకు ఎంపీపీ పదవి కట్టబెట్టినందుకు పవర్ రామారావు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం పటేల్ వెంట ఉంటానన్నారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన అంగోళ్ల నర్సారెడ్డి ఎమ్మెల్యే పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పవర్ రామారావు పటేల్ మాట్లాడుతూ ముధోల్ నియోజకవర్గంలో గ్రామ గ్రామాన కాషాయ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమన్నారు. తమకు మైనార్టీలు వ్యతిరేకం కాదని, మైనార్టీ సోదరుడైన అబ్దుల్ రజాక్ తనకు నమ్మినబంటుగా ఉన్నందునే ఎంపీపీ పదవి కట్టబెట్టడం జరిగిందన్నారు. బిజెపి దేశద్రోహులకు వ్యతిరేకమని, ఏ కులానికి, మతానికి వ్యతిరేకం కాదన్నారు. అందరి సహకారంతో నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీలను వారి స్థానాల్లో కూర్చోబెట్టి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి గంగాధర్, మాజీ కుభీర్ ఎంపీపీ బోయిరెడ్డి విట్టల్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, భైంసా జెడ్పిటిసి సోలంకి దీప భీంరావు పటేల్, బిజెపి రాష్ట్ర నాయకులు బాజీరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



గిరిజనులను చిత్ర హింసలకు గురిచేస్తున్నారు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

జిల్లాలోని షేర్కపల్లి, రెంగరీట్, దరిగాం గ్రామాలకు చెందిన గిరిజనులను అటవీ శాఖ అధికారులు మూడు రోజులుగా చిత్ర హింసలకు గురి చేస్తున్నారని జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. కాగజ్‌నగర్ మండలంలోని దరిగాం అటవీ ప్రాంతంలో పులిపై విషప్రయోగం చేశారని, అనుమానితులను అటవీ శాఖ అధికారులు అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయమై శుక్రవారం అటవీ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన యువకులు తప్పుచేసి ఉంటే రుజువు చేసి తగిన చర్యలు తీసుకోవాలి తప్ప అమాయక గిరిజనులకు కొట్టడం సరికాదన్నారు. అందులో పశువుల కాపరి మైనర్ గిరిజనుడు కూడా ఉన్నాడని తెలిపారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో గతంలో గిరిజనులపై పులి దాడి చేసి ఇద్దరిని చంపినప్పుడు రూ.5లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కుటుంబీకులకు ఎలాంటి ఆధారాలు చూపకుండానే కోర్టులో హాజరుపరిచినట్లు తెలుస్తుందని, ఇది సరైనది కాదని అన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, సమగ్ర విచారణ జరిపి గిరిజనులను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా చేపట్టిన జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, పాఠకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం జిల్లా కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాఖా గ్రంథాలయాలలో పాఠకులకు అవసరమైన పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

16 నుండి చేపట్టే రిలే నిరాహార దీక్షలకు మద్దతివ్వండి



నవతెలంగాణ -ఆదిలాబాద్‌అర్బన్

ఈ నెల 16 నుండి చేపట్టే రిలే నిరాహార దీక్షలకు అన్ని సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ సాధించడం కోసం ప్రత్యేక కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ఆర్ అండ్ బి అమరవీరుల స్తూపం దగ్గర ఈనెల 16 నుంచి రిలే నిరాహార దీక్షలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైల్వే లైన్ సాధించేంతవరకు అలుపెరుగని పోరాటం చేయాలని కమిటీ లో తీర్మానించినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ ఆకాంక్షను నెరవేర్చడం కోసం మండల గ్రామ వార్డు కమిటీలతో వినూత్న రీతిలో ప్రతిరోజు నిరసన తెలిపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులను కేటాయించి ఏడాదిలోపు రైలును అందుబాటులోకి తెచ్చేలా ఉద్యమించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పనులు అడ్డంకులను తొలగించి వెంటనే భూసేకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సాధన కమిటీ నాయకులు అశోక్, కౌసల్య, నారాయణ, నరేందర్, కందుల రవీందర్, వెంకట నర్సిములు, సిర్ర దేవేందర్, ఆశన్న, బండి దేవిదాస్, రాజిరెడ్డి, ఆశన్న, శ్రీనివాస్, రాజు, శోభ, కృష్ణ మీనన్, అఖిల్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను తొలగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన గౌస్ ఆలంను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయ్ గంధేవార్, శివయ్య ముదిరాజ్, సతీష్‌రెడ్డి, హరికాంత్ ఉన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-నార్నూర్

ఫీల్డ్ వర్క్‌లో భాగంగా శుక్రవారం ఫౌండేషన్ సభ్యులు వాగ్మారే భావ్‌రావ్, మానే సత్యవర్ధన్‌లు ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను జిల్లా కేంద్రంలో ఎస్పీ గౌస్‌ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతిమ హాస్పిటల్ అందిస్తున్న సేవలు, ప్రతిమ హాస్పిటల్ ప్యాకేజీలు, ప్రతిమ హాస్పిటల్ మెడికల్ క్యాంపు, బస్సు, ఉచిత బస్సుల సౌకర్యాలు, ప్రతిమ హాస్పిటల్ అంబులెన్సు సేవలు ప్రతిమ ఫౌండేషన్ స్కిల్ ప్రోగ్రామ్స్ గురించి వివరించారు. వారి వెంట ప్రతిమ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కౌసిక్, ప్రతిమ ఫౌండేషన్ ప్రోగ్రామ్ కోర్డినేటర్ గీత, ప్రకాష్ రావ్ ఉన్నారు.



కార్యదర్శిగా ఎన్నికైన గంగాధర్‌కు టీఎన్జీవోస్ సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొండూరి గంగాధర్‌ను శుక్రవారం జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం టీఎన్జీవోస్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సంద అశోక్ మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్, తిరుమల్‌రెడ్డి, గోపి, నారాయణ, చంద్రశేఖర్, ఫాహీన్ సర్కార్, ఆదిలాబాద్ రూరల్ అధ్యక్షులు అసూరి ప్రవీణ్, అర్బన్ కార్యదర్శి అరుణ్, దేవేందర్, చిట్ల గంగాధర్, సునీల్, వెంకటేష్, అఖిల్, డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సప్ధర్ అలీ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా సరిచేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలో నిర్వహించిన గ్రామసభల్లో ఓటరు జాబితాను చదివి వినిపించినట్లు తహసీల్దార్ శ్రీలత శుక్రవారం తెలిపారు. సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్‌లో భాగంగా ఈ గ్రామ సభలను నిర్వహించినట్టు వివరించారు. ఆయా గ్రామాల్లో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ)ల చేత గ్రామ సభలు నిర్వహించి, ఓటరు జాబితాను చదివి వినిపించటంతో పాటు నూతన ఓటరు నమోదుపై, చేర్పులు మార్పుల జాబితాపై అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ గంగాధర్, బీఎల్‌ఓలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ పీఓకు వినతి



నవతెలంగాణ-తలమడుగు

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం ఉట్నూర్‌లో ఐటీడీఏ పీఓకు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని కోసాయి, ఉమ్రి గ్రామాల్లో గిరిజనులు గత సంవత్సరంలో 60 మంది గిరిజన రైతులకు ఎస్డీఎఫ్ నిధుల నుంచి విద్యుత్తు సరఫరా అందజేయగా మిగిలినపోయిన 20మంది గిరిజన రైతులకు సైతం కోసాయి, ఉమ్రి గ్రామాల రైతులకు విద్యుత్తు కనెక్షన్ లు మంజూరు చేయించి ఆదుకోవాలని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులతో పాటు ఎంపీటీసీ మేస్త్రం హనుమంతు, దత్తు పటేల్, పోశెట్టి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.

అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి సంవత్సరం అలాగే పీజీ మొదటి సంవత్సరం కొరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్టు ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అచ్చి శ్రీనివాస్, యూనివర్సిటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ టి.ప్రతాప్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 31 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అడ్మిషన్ల కొరకు ఏదైనా టీఎస్ ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, వెరిఫికేషన్ కొరకు మీరు ఏ అధ్యయన కేంద్రంలో అడ్మిషన్ తీసుకుంటారో ఆ అధ్యయన కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అలాగే ఏదైనా మీసేవ కేంద్రాలలో లేదా టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో ఫీజు చెల్లించి రసీదులు పొందాలన్నారు. దరఖాస్తు ఫారం అధ్యయన కేంద్రంలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కొరకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఉన్న అధ్యయన కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు.

పరీక్ష ఫీజుకు గడువు 17 వరకు..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారి డిగ్రీ రెండో సంవత్సరం, మూడో సెమిస్టర్ అలాగే డిగ్రీ మూడో సంవత్సరం వారి ఐదో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించుటకు ఈనెల 17 ఆఖరి తేదీ ఉన్నట్టు పేర్కొన్నారు. పరీక్ష ఫీజును ఏదేని టీఎస్ ఆన్‌లైన్ సెంటర్‌లో లేదా మీసేవ కేంద్రాల్లో కానీ చెల్లించి రసీదును పొందాలని సూచించారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు.

అందుబాటులోకి హాల్ టికెట్‌లు..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో పీజీ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు అందుబాటులో వచ్చాయని పేర్కొన్నారు. పరీక్షల హాల్ టికెట్లు కొరకు యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఆన్‌లైన్.ఇన్ లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి, హాల్ టికెట్‌లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

ట్యూషన్ ఫీజు చెల్లింపు గడువు 31 వరకు..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండో సంవత్సరం, మూడో సంవత్సరం అలాగే పీజీ రెండో సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించుటకు గడువు తేదీని పొడగించినట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎవరైనా ఫీజులు చెల్లించని వారు ఉంటే ఆన్‌లైన్ సెంటర్‌లో కానీ లేదా మీసేవ కేంద్రాలలో ఫీజులు చెల్లించి రసీదును పొందాలని సూచించారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఫీజు చెల్లించాలని సూచించారు.

హీరాసుక్కా జయంతిని అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగిందని, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీ జిల్లా నాయకుడు గేడం మాధవ్ అన్నారు. రాజకీయంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌ను జాగృతి చేసేందుకు సమాజ్ పెద్దలుగా తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు తమకు సంక్షేమ పథకాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఆదివాసుల ఆరాధ్యదైవమైన హీరా సుక్కా జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. అలాగే ఐటీడీఏకు నిధులు మంజూరు చేసి, ఆదివాసుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. శనివారం ఇంద్రవెల్లిలో జరుగనున్న సన్నాహక సమావేశానికి ఆదివాసీ మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. మావల మండల కార్యవర్గం ఎన్నిక, మావల మండల ఆదివాసీ పర్ధాన్ సమాజ్ మండల కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోడం వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మడావి కరుణాకర్, గౌరవ అధ్యక్షునిగా మడావి నారాయణ, మెస్రం ప్రేమ్‌నివాస్, ఉపాధ్యక్షునిగా మడావి రతన్, సలహదారులుగా మెస్రం ప్రకాష్, మడావి స్వామిదాస్, మెస్రం ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మడావి దత్తు, కోశాధికారిగా మడావి సంతోష్, ప్రచార కార్యదర్శిగా మడావి అరుణ్ కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా మెస్రం అఖిల్, మడావి సుధాకర్, ఉయిక అవినాష్, కొడప రఘువీర్, మెస్రం కిరణ్, మెస్రం కిషోర్, మెస్రం రోషన్‌లు ఉన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ సమావేశంలో అడహక్ కమిటీ సభ్యులు మడావి దిగంభర్, సెడ్మకి సుభాష్, మడావి గణేష్, గేడం దీపక్ పాల్గొన్నారు.

హామీల అమలుపై నిర్లక్ష్యం వీడాలి

- మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్



నవతెలంగాణ-బేల

మండలంలోని జునోని గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన కుమురంభీం విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హజరయ్యారు. గ్రామస్తులు వారి సాంప్రదాయ వాయిద్యాలతో జోగు రామన్నకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కుమురంభీం చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో కలిసి నూతన కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కుమురంభీం ఆశయ సిద్ధాంతాన్ని పక్కన పెట్టి స్వార్థపూరిత రాజకీయాలు చేశారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో కుమురంభీం ఆశయ సాధనకు ఎంతగానో కృషి చేశారన్నారు. రూ.50 కోట్లతో మ్యూజియాన్ని ఏర్పాటు చేసి ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలకు నిలిచిపోయేలా నిర్మాణాలను చేపట్టారన్నారు. ఆదివాసులకు పట్టాలు, రైతుబంధు ఇచ్చిన ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై చిన్న చూపు చూపించకుండా, వారికి రావాల్సిన హక్కులను అందించడంలో కృషి చేయాలన్నారు. లేనియెడల రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ అభయ హస్తం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రూ.12 లక్షల ఆర్థిక సాయాన్ని దళిత కుటుంబాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, గంభీర్ ఠాక్రే, సతీష్ పవార్, దేవన్న, సునీల్, కుమ్ర రాజు, మెంతెం దత్తు, అరుణ్, విపిన్, సునీల్ గోడం, సుదర్శన్ పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణకు కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో చెరువులు భూములు ఆక్రమాలకు గురికాకుండా కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ చెరువుల పరిరక్షణ కమిటీలో అడిషనల్ ఎస్పీ, ఆర్డీఓ, ఇరిగేషన్ ఈఈ, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ, మున్సిపల్ కమిషనర్ లు ఉంటారని తెలిపారు. జలవనరులకు అధిక ప్రాధాన్యతనిస్తూ, వాటి పరిరక్షణ కోసం అదనపు కలెక్టర్ రెవెన్యూ నేతృత్వంలో కమిటి సభ్యులతో కలిసి చెరువులను పరిశీలించారు. వాటి ఎఫ్‌టీఎల్, సర్వే నెంబర్లను గుర్తించి, నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ సహకారంతో చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయని, ఎవరైన బఫర్ జోన్ పరిధిలోని చెరువులను ఆక్రమిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ మేరకు అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి, ఆర్డీఓ రత్న కళ్యాణి, ఈ ఈ ఇరిగేషన్ రామారావు, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, కడెం, నిర్మల్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసును వేగవంతం చేయాలి

- ఎస్పీని కలిసిన అంబేద్కర్ సంఘాల నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇటీవల మావల గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీ పై జరిగిన హత్యాయత్నానికి బాధ్యులైన ప్రధాన నిందితులకు కఠిన శిక్షణ విధించేలా, కేసు విచారణను వేగవంతం చేయాలని, అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి సభ్యులు కోరారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంను ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ముందుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. హత్యాయత్నం కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేయాలని, విచారణను పారదర్శకంగా అవసరమైతే విచారణ అధికారిని మార్చాలని బాధితులకు రక్షణ కల్పించాలని అన్నారు. తక్షణమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసుకు సంబంధం ఉన్న నిందితులను సైతం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరగాలని కోరారు. ఈ కేసు విషయంలో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, బాధితులకు రక్షణ కల్పించే బాధ్యతను తీసుకుంటానని, అన్ని విధాల బాధితులకు అండగా ఉంటానని ఎస్పీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్, నల్లంటి నవీన్, బాధితుని తల్లిదండ్రులు నాయకులు నల్ల రాజేశ్వర్, శశికాంత్, నిమ్మల ప్రశాంత్, శోబతాయి తుల్జాపూరే, సత్యనారాయణ, ఈర్ల దయాకర్, సందీప్ దాండియా ఉన్నారు.

నేటి యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

నేటి యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వివేక్‌చౌక్‌లో నిర్వహించిన వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. నేటి యువతరం స్వామి వివేకానందనీ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రావుల రామనాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎంఐఎం నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్‌ఆలంను ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంఐఎం పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సత్కరించారు. అనంతరం పట్టణంలోని వీధి వ్యాపారుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీ వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంఐఎం జాయింట్ సెక్రటరీ షకీల్ అహ్మద్ తెలిపారు.

సమాజంలో పత్రికల పాత్ర కీలకం



నవతెలంగాణ-నార్నూర్

నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని తహసీల్దార్ రాజ లింగం, డీటీ అమృత్‌లాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్‌లో నవతెలంగాణ దిన పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించి, మాట్లాడారు. నవతెలంగాణ దినపత్రిక ప్రజా సమస్యలను వెలికి తీస్తూ అధికారులకు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. క్యాలెండర్ ఆవిష్కరణలో బ్యాంక్ మేనేజర్ అంబోతు శ్రీనివాస్, సూపరింటెండెంట్ గంగాసింగ్, సీఓ అడే గణేష్, ఏపీఎం రమేష్, ఎంపీఓ స్వప్నశీల, సీడీపీఓ శారద తాడిహత్నూర్ మార్కెట్ కమిటీ సభ్యులు విశాల్ కోటగిరి, బంజారా యువసేన మండల అధ్యక్షుడు దత్త జాదవ్, ఉపసర్పంచ్ విష్ణు, కార్యదర్శి శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టార్ ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్ రూ.12లక్షల 9వేల 41 రూపాయి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించలేదని, మున్సిపల్ అధికారులు నోటీసులు అందించిన అలసత్వం వహించడంతో శుక్రవారం ఫంక్షన్ హాల్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వారిలో ఆర్ఎ గంగాధర్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, శాకీర్ ఖాన్, బిల్ కలెక్టర్ భరత్, లక్ష్మణ్ ఉన్నారు.

అధికారులు, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

అధికారులు, ప్రజలకు జవాబు దారీతనంగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సింగారి కిషన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. అధికారికంగా మొదటిసారిగా మండలానికి వచ్చిన ఎమ్మెల్యేకు అన్ని శాఖల వారీగా శాలువాతో సన్మానించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికను చదివి వినిపించగా, వెనువెంటనే అధికారులకు బదులిస్తూ, ఏ సమస్యలు ఉన్న వెంటనే దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తేనే మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ శారద శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాజు నాయక్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రస్థాయి యువజన, సాంస్కృతిక క్రీడల పోటీల్లో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 10, 11 తేదీల్లో పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన క్రీడా పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అశ్విత, జోష్మిక, రిషిత, రుచిత, శృతి, జహీర్, నిశాంత్, సూర్య అలాగే జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో జరిగిన ఉపన్యాస, ఫోటోగ్రఫీ, పోస్టర్ మేకింగ్ పాటల పోటీలలో గెలిచి రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ తెలిపారు.

కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం..

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. అదేవిధంగా డిప్లమా సివిల్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న డి.ఐశ్వర్య రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడల్లో చెస్ విభాగంలో ద్వితీయ బహుమతి గెలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ అధ్యాపక, కార్యాలయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

నేర సమీక్ష సమావేశం నిర్వహించిన డీఎస్పీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ డీఎస్పీ అల్లూరి గంగారెడ్డి లక్ష్మణచాంద పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. సోన్ సర్కిల్‌లోని పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పాత కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, వారి డ్యూటీలకు సంబంధించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సోన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నవీన్ కుమార్, సోన్ ఎస్సై రవీందర్, లక్ష్మణచాంద ఎస్సై సల్ల శ్రీకాంత్, మామడ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.